ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 6 జూలై 2025

గరిష్ఠం 34.5
కనిష్ఠం 21.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	524.70 (157.9860)	56,718	4,496
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	208.56	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.215 (20.3903)	నిల్	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో శనివారం సామూహిక గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. ఆలయంలో వేకువజామున స్వాతి వేడుకలు, గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల్లో ప్రదక్షిణ చేశారు.

7

నేడు మొహర్రం



మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకకు సర్వం సిద్ధమైంది. తొమ్మిది రోజుల ముందు నుంచే పీర్ల సందడి నెలకొనగా, ఆదివారం అలావ ఆడి ఊరేగింపు నిర్వహిస్తారు. అందుకోసం పల్లెలు, పట్టణాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదేవిధంగా భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.

7

చైతన్యానికి ప్రతీక తొలి ఏకాదశి



ప్రజల్లో ఉండే చైతన్యానికి ఏకాదశి ప్రతీక. వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కావడంతో తొలిఏకాదశిగా పిలుస్తారు. ఈ ఏకాదశి నుంచే పండుగలు ఆరంభమవుతాయి. అందుకే తొలి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేస్తారు. విష్ణువుకు సంబంధించిన ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

అమృత్ 2.0 పనుల ఊసేదీ?

▸ పథకం కింద పట్టణ చెరువుల అభివృద్ధికి నిధులు ▸ డీపీఆర్‌కే పరిమితమైన ప్రతిపాదనలు



పట్టణాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తోంది. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు పనులకు నిధులు మంజూరయ్యాయి. అయితే సంవత్సరాలు గడుస్తున్నా ప్రతిపాదిత పనులు మాత్రం డీపీఆర్ దశలోనే ఉండడంతో పథకం అమలు మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కు చందంగా తయారైంది.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా అమృత్2.0 కింద పనులు సాగుతున్నాయి. భవిష్యత్‌లో పట్టణాల విస్తరణ, జనాభాకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు 18 మునిసిపాలిటీల్లో రూ.450 కోట్లతో ట్యాంకులు, పైపులైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అదే సమయంలో 15 మునిసిపాలిటీలలోని 16 చెరువుల అభివృద్ధికి అమృత్ 2.0లోనే సుమారు రూ.50 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదిత అభివృద్ధి పనులు డీపీఆర్ దశ దాటలేదని తెలుస్తోంది. దీంతో చెరువుల శుభ్రం, సుందరీకరణ, చెరవు కట్టల బలోపేతం తదితర పనుల్లో జాప్యం నెలకొన్నది.

16 చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 19 మునిసిపాలిటీలున్నాయి. ప్రతీ మునిసిపాలిటీలో ఒక్కో చెరువును అమృత్ 2.0లో అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే సాంకేతిక, ఇతర కారణాలతో 15 మునిసిపాలిటీల పరిధిలోని 16 చెరువుల అభివృద్ధికి మాత్రమే అమృత్ 2.0 కింద సుమారు రూ.50కోట్ల వ్యయంతో ప్రతిపాదించారు. నల్లగొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో ఒకటి చొప్పున మునిసిపాలిటీల చెరువులకు అభివృద్ధి జాబితాలో చోటుదక్కలేదు. కానీ నల్లగొండ మునిసిపల్ పరిధిలో రెండు చెరువులకు అవకాశం కల్పించారు. అయితే తాగునీటి పనులు ప్రారంభమై సుమారు ఏడాదిన్నరపైగా గడుస్తున్నా చెరువుల అభివృద్ధి ఊసే మరిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పలు చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని ప్రతిపాదించగా తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా ఆ హామీలను నెరవేరుస్తామని ప్రభుత్వమిచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేరని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0పథకంలో ప్రతిపాదించిన చెరువుల అభివృద్ధి పనులు డీపీఆర్ పరిధిలోనే ఆగడం గమనార్హం. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది.

పనులు ఇలా..

అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణ చెరువుల అభివృద్ధికి ప్రతిపాదించారు. ఈమేరకు చెరువుల శుభ్రం, తిరిగి అపరిశుభ్రత కాకుం డా శాశ్వత నివారణ చర్యలు, చెరువు కట్ట బలోపేతం, సుందరీకరణ, ఫుట్‌పాత్, లైటింగ్, ఎంటర్‌టెయిన్‌మెంట్ పార్క్ తదితర పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం చెరవు విస్తీర్ణం, స్థానిక ఆవశ్యకత ఆధారంగా ..

- మిగతా 7వ పేజీలో...

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



ఇటీవల కురిసిన మోస్తారు వర్షాలతో మెట్ట పంటలు గట్టెక్కాయి. జూన్ నెల మొత్తం వరుణుడు ముఖం చాటేయగా, జూలై మొదటి వారంలో ముసురు నుంచి మోస్తరు వర్షాలు పత్తి పంటకు ఊపిరి పోశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా కురిసిన వర్షాలతో రైతులు ఊరట చెందారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

▸ ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి చేలకు ఊపిరి
▸ ఇప్పటి వరకు 3లక్షలకు పైగా ఎకరాల్లో పత్తిసాగు
▸ పెరిగిన యూరియా వాడకం

జిల్లాలో ఈ సీజన్‌లో అత్యధికంగా మునుగోడు నియోజకవర్గంలో 90వేల ఎకరాల్లో పత్తిసాగు చేయగా, దేవరకొండ నియోజకవర్గంలో 80వేల ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాల్లో ముందస్తుగా పత్తి విత్తనాలు విత్తారు. ఇవి మొలకెత్తగా, ఆ తరువాత వరుణుడు ముఖం చాటడంతో రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో కురిసిన వర్షాలు పంటలకు జీవం పోశాయి. వర్షాలు కురిసిన తరువాత మరో 70వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఈనెల 15వ తేదీ వరకు పత్తి విత్తనాలు విత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరో మూడున్నర లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పాటికే పత్తి చేలు ఏపుగా పెరగాల్సి ఉండగా, వర్షాలు లేక ఆలస్యంగా విత్తనాలు వేసే పరిస్థితి ఏర్పడింది. గత నెలలో మొక్కలు అన్నీ వాడుపట్టగా, చాలా మంది రైతులు పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేశారు. ప్రస్తుతం అవి మొలకెత్తుతుండటంతో రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

ఆలస్యంగా వర్షాలు కురవగా, ప్రస్తుతం రైతులంతా పొలం బాట పట్టారు. ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తిన చేలల్లో గుంటుక తోలి ఎరువు లు వేస్తున్నారు. గత నెలలో విత్తనాలు విత్తని రైతులు ప్రస్తుతం పత్తి విత్తనాలు విత్తుతున్నా రు. మే నెలాఖరులో కురిసిన వర్షాలతో అప్పటి కే విత్తనాలు తెచ్చుకున్న రైతులు వర్షాలు లేక నష్టపోతామని ఆందోళన చెందగా, తాజాగా కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలతో పాటు వరి నారు విరివిగా పోస్తున్నారు. అయితే బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లేక కొద్ది కొద్దిగా నీరు పోస్తున్నాయి. వర్షాలు భారీగా కురిస్తేనే ఎండిన బోర్లు మళ్లీ నీరు పోసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వరి నార్లు పోసుకున్న రైతులు పొలాలను దమ్ము చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి కే 5వేల ఎకరాల్లో వరినార్లు పోసిన రైతులు నా ట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నల్లగొండ డివిజన్‌లో ఇప్పటి వరకు 900.5మి.మీల వర్షం కురవగా, 8.5శాతం లోటు వర్షపాతం ఉంది. మిర్యాలగూడ డివిజన్‌లో 863.9మి.మీల వర్షపాతం నమోదు కాగా

- మిగతా 8వ పేజీలో...

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. జూలై నెలాఖరు వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి. ప్రతీ రోజు ఎరువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకూడదు. వర్షాలు కురవడంతో యూరియా వాడకం పెరిగింది. పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియాతో పాటు ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాం.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

విపత్తుల నిర్వహణ అందరి బాధ్యత

జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్

నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణ అందరి బాధ్యత అని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలు, తుపానులు, భూకంపాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు జాతీయ విపత్తులు, రాష్ట్ర విపత్తుల బృందాలు అక్కడికి చేరుకునేలోగా సహాయంగా ఉండేందుకు అన్ని జిల్లాల్లో ఆపద మిత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతీ శాఖ కార్యాచరణ రూపొందించాలని, దీనికి నెలాఖరులోగా రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ఆమోదం పొందాలన్నారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ అధికారి గౌతమ్ మాట్లాడుతూ, విపత్తు నివారణకు జిల్లా స్థాయిలో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ఆపద మిత్రులకు మూడో విడతల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. సమావేశంలో అథారిటీ అండర్ సెక్రటరీ అభిషేక్ బీస్వాల్, వసీం ఇక్బాల్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణకు సన్నద్ధం: కలెక్టర్

విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం విపత్తుల నిర్వహణ అథారిటీ బృందం అధికారులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, పోలీస్‌శాఖ తరఫున 12వ బెటాలియన్‌లో 80 నుంచి 100మందికి విపత్తుల నిర్వహణపై శిక్షణ ఇచ్చామన్నారు.వారి వెంట అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్,ఆర్డీవోఅశోక్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ఉన్నారు.

బాలసదన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

జిల్లా కేంద్రంలోని పానగల్ రోడ్డులో రూ.1.34కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాలసదన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. బాలసదన్ ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. అదనపు బ్లాక్‌ల నిర్మాణానికి రూ.60లక్షల అదనపు బడ్జెట్ కావాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి కలెక్టర్‌ను కోరగా, ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ఆదేశించారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ ఆహ్మద్, తదితరులు ఉన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

సాయిబండా తండా గిరిజన రైతుల వేడుకోలు

మర్రిగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మా భూములు మాకు ఇప్పించాలని కోరుతూ ఖుదాభక్షిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయిబండా తండా గిరిజన రైతులు కోరారు. శనివారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 38 నుంచి 44, 49, 40లలో 700 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్నామని తెలిపారు. 2005లో ఆకుల రాజయ్య మమ్మల్ని మభ్యపెట్టి భూములను తక్కువ ధరకు తీసుకున్నాడని ఆరోపించారు. అప్పటి నుంచి భూముల కోసం ఆందోళన చేస్తున్నామని, ఆ క్రమంలోనే రాజయ్య 2006 నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు విక్రయించాడని తెలిపారు. 2018లో ఆ భూములను శివరాత్రి చంద్రయ్య కంపెనీ పేరిట కొనుగోలు చేశారని, ఇప్పటికి కూడా మేమే వ్యవసాయం చేసుకుంటున్నామని అన్నారు. పొలాల్లోకి వెళితే మమ్మల్ని బెదిరిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా విషయాన్ని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ట్రిబ్యునల్ కోర్టులో రైతులకే అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. మా భూములు మాకు దక్కకుండా కొనుగోలు చేసిన కంపెనీ యాజమాన్యం కుట్ర చేసిందని ఆరోపించారు. గిరిజన రైతులనే చులకన భావంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము సాగు చేసుకుంటున్న భూములు మాకు దక్కేలా సహకరించాలని తహసీల్దార్ కోరినట్లు రైతుల వెల్లడించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పనులు త్వరగా పూర్తి చేయాలి



నాంపల్లిలో లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం

నాంపల్లి, జూలై5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం సభ్యులు సలీం కుమార్, సలీం మోహన్ అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. కేంద్ర నిధుల నుంచి అమలవుతున్న వితంతు, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలకేంద్రంలో గల నర్సరీలు, గ్రామపంచాయతీ కార్యాలయంలో గల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నవీన్ కుమార్, ఏపీడీ యామిని, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీవో ఝాన్సీ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీవో వినోద్ కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ ఉదయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంజి వెంకటేశం తదితరులు ఉన్నారు.

గట్టుప్పల్: మండలకేంద్రంలో చేపట్టిన పనులను కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసింది. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, సామూహిక ఇంకుడు గుంతలు, తదితర పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి టి.అశోక్‌రెడ్డి, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ ఖాజా మొయినొద్దీన్, ఎంపీడీవో జె.మాదవరెడ్డి, వెంకన్న, ఎండీ షఫీ, కె.శివగౌడ్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యో తి): విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థ ల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందుకోసం బీసీలంద రూ ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని యాద వ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. తెలంగాణ హైకోర్టు సెప్టెంబరు 30వరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇచ్చినందున బహుజన వర్గాలు గ్రామస్థాయి నుం చి ఉద్యమించాలన్నారు. సమావేశంలో పిల్లి రామరాజు యాదవ్, కొండూరు సత్యనారాయణ, వంగూరు లక్ష్మీనారాయణ యాదవ్, పందుల సైదులు, మాదగోని భిక్షపతి, పొట్టబత్తుల సత్యనారాయణ, బాలాజీ, మోహన్, ఆంజయ్య, శ్రీనివాస్, శివ, నాగరాజు, హరిబాబు పాల్గొన్నారు.

అరణ్యంలో అద్భుత చిత్రాలు









యాదగిరిగుట్ట అరణ్యంలో అద్భుత చిత్రాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన నామోజు లావణ్య భారీ బండరాళ్లపై జంతువుల రూపాలకు తన కుంచెతో ప్రాణం పోస్తోంది. యాదగిరిగుట్ట వెళ్లే దారిలో అంజనేయ అరణ్యంలో ఈ చిత్రాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల భారీ కొండలు, బండరాళ్ల మీద పులి, ఏనుగు, సింహం, ఎలుగుబంటి తదితర జంతువులు, రామచిలుక వంటి పశుపక్షాదులు లావణ్య తన చేతులతో రెండు నెలలు రూపుదిద్దుకున్న బొమ్మలు బహుళ ప్రాచుర్యం పొందాయి. దేశవ్యాప్తంగా ప్రయాణించి ప్రముఖ దేవాలయాల దేవతామూర్తులు, వన్యప్రాణుల బొమ్మలు గీసి ప్రాచీన సంప్రదాయాలు, అటవీ సంపదను కాపాడాలనే సందేశం వ్యాప్తిని పెయిటింగ్ ద్వారా ప్రయత్నిస్తానని ఆమె చెప్పారు. చిత్ర కళను విస్తరించేందుకు చిన్నారులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్,
ఆంధ్రజ్యోతి, యాదాద్రి



మోకాళ్ల నొప్పులు భరించలేక రైతు ఆత్మహత్య


వెంకట్‌రెడ్డి(ఫైల్)

పెన్‌పహాడ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామంలో మోకాళ్ళ నొప్పులు భరించలేక ఒక వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు వెన్న వెంకట్‌రెడ్డి(58) కొన్నాళ్లుగా మోకాళ్లనొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా ఫలితం కనిపించలేదు. నొప్పులు భరించలేక శనివారం ఉదయం గ్రామశివారులో క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చాక భార్య పద్మకు చెప్పాడు. దీంతో వెంటనే ఆయన కుటుంబసభ్యులు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వెంకట్‌రెడ్డికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నవీన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రాములు తెలిపారు.

కుమార్తెను బావిలో పడేసి, తానూ దూకిన తల్లి

తల్లి మృతదేహం లభ్యం, పాప మృతదేహం కోసం గాలింపు



బావిలో గాలిస్తున్న ఫైర్‌సిబ్బంది, కుమార్తెతో వాణి(ఫైల్‌ఫొటో)

శాలిగౌరారం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ తన ఏడాది వయస్సులోపు పాపను బావిలో పడేసి తానూ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తల్లి మృతదేహాన్ని వెలికితీయగా, పాప మృతదేహం కోసం ఇంకా గాలిస్తున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన సాయిని శంకర్ కుమార్తె వాణి(25)ని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన సింగారపు మహేష్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఒక కుమార్తెకు రెండు సంవత్సరాలు, మరో పాపకు 9నెలలు కుమార్తె ఉన్నారు. వాణికి మొదటి కుమార్తె పుట్టిన నాటి నుంచి మానసికంగా అనారోగ్యంగా ఉంటోంది. దీంతో తరచూ తల్లిగారి గ్రామమైన వంగమర్తికి వచ్చి వెళ్తుంది. రెండో కుమార్తె జన్మించిన తర్వాత ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించి మతిస్థిమితం కోల్పోయింది. ఈ నేపథ్యంలో వంగమర్తిలో శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో సింగారపు వాణి తన తొమ్మిది నెలల పాపను ఎత్తుకొని గ్రామశివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న బావి వద్దకు వెళ్లింది. కుమార్తెను బావిలో పడేసి తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. వాణి తల్లిదండ్రులు ఆమె ఆచూకీ కోసం గ్రామంలో వెతుకుతుండగా, పత్తి పనులు నిర్వహిస్తున్న కూలీలు వాణి రోడ్డు పక్కన ఉన్న బావి దగ్గర కనిపించినట్లు చెప్పడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి గాలించారు. ఆచూకీ కొంతమంది గ్రామస్థులు, సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది 4గంటల ప్రాంతంలో బావిలోకి దిగి వెతికారు. వాణి మృతదేహం లభ్యం కాగా, పాప మృతదేహం కోసం గాలిస్తున్నారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. వాణి తండ్రి సాయిని శంకర్ ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.సైదులు తెలిపారు. వాణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి


శ్రీను(ఫైల్)

పెన్‌పహాడ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చెట్ల ముకుందాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మామిడి శ్రీను(58) ఇంట్లో బోరుమోటార్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్టేషన్ హౌజ్ అధికారి రాములు తెలిపారు. శ్రీను మృతదేహం వద్ద మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, సతీష్, సంతాపం తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి ...

బీబీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఔషాపూర్ గ్రామానికి చెందిన బొంకెంపల్లి సాయిలు(70) భిక్షాటన చేస్తుండేవాడు. శనివారం ఆయన బీబీనగర్ చెరువులో బట్టలు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి నీళ్లలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందక ఇబ్బందిపడుతున్నారని, గ్రీన్‌ఛానల్ ద్వారా వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నల్లగొండ జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతేపాక వినోద్‌కుమార్, యూనియన్ జిల్లా సోషల్‌మీడియా బాధ్యులు ఇరిగి ఎల్లేష్, యూనియన్ మండల సహాయకార్యదర్శి ఆమనగంటి శేఖర్‌రెడ్డి, కోశాధికారి పాలడుగు నరసింహ, మేకల నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విషాదాలు మిగిల్చిన రోడ్డు ప్రమాదాలు

ముగ్గురి మృతి, నలుగురికి గాయాలు

ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు పలువురి కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. నల్లగొండ జిల్లా కట్టంగూరులో తల్లీకుమారుడు మృతి చెందగా, హాలియాలో భార్యాభర్తలతో పాటు కుమారుడు మృతి చెందగా, భువనగిరిలో తల్లీ మృతి చెందింది.


మల్లమ్మ (ఫైల్)

భువనగిరి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో శనివారం బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండలం మగ్దుంపల్లి గ్రామానికి చెందిన సిల్వేరు సత్యనారాయణ-మల్లమ్మ(55) దంపతులు ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి భువనగిరిలోని నెహ్రూరోడ్డు నుంచి జంఖాన్‌గూడ చౌరస్తాకు వచ్చారు. నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న నల్లగొండ డిపో బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో మల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను జిల్లా ఆస్పత్రికి తరలించారు. రైతు కూలీలైన ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెల్లో ఒకరి వివాహం కాగా, ఇద్దరు చదువుకుంటున్నారు. మల్లమ్మ కుటుంబసభ్యులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్యభర్తలతో పాటు కుమారుడు..

హాలియా, జూలై 5 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లి గ్రామం వద్ద శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు మెరుగైన చికిత్సకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గురజాలకు చెందిన మొరం నాగేశ్వర్‌రావు, భార్య పార్వతీ కుమారుడు అభిరామ్‌లు కలిసి ద్విచక్రవాహనంపై శనివారం తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామంలో జరిగిన శుభకార్యానికి వచ్చారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని కొత్తపల్లి గ్రామసమీపంలోకి రాగానే హాలియా నుంచి నాగార్జునసాగర్ వైపు వెళ్లే కారు అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది.

ప్రమాదంలో నాగేశ్వరరావు, పార్వతీ, అభిరామ్‌లు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని అనంతరం మాచర్లకు తరలించారు. గాయపడిన వారి బంధువులు లక్ష్మీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దశదినకర్మకు వెళ్లి వస్తూ తల్లీకుమారుడు..

కట్టంగూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌కు చెందిన తల్లీకుమారులు పిట్టల శంకరమ్మ(41), పిట్టల రజనీకాంత్(25) శనివారం నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో జరిగిన బంధువుల దశదిన కర్మకు హాజరయ్యారు. అదే రోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై తల్లీకుమారులు ఓగోడు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. కట్టంగూరు గ్రామశివారులోకి రాగానే అతివేగంగా ద్విచక్రవాహనం నడుపుతున్న రజనీకాంత్ హైవే పక్కన ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రజనీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న శంకరమ్మను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. కాగా మృతుల స్వగ్రామం శాలిగౌరారం మండలం ఉట్కూర్ గ్రామం కాగా వీరు బతుకుదెరువు కోసం 30 ఏళ్ల కిందటే హైదరాబాద్‌కు వెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

పనిచూసుకుని వస్తానని వెళ్లి మృత్యువాత

● 13 రోజులుగా ఆచూకీ లభించని భర్త కోసం పోలీస్‌స్టేషన్‌కు భార్య ● అక్కడ గుర్తుతెలియని మృతదేహాల్లో భర్త ఫొటో


పవన్ (ఫైల్)

భువనగిరి టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ 13రోజులకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కానీ అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా పోలీసులు అంత్యక్రియలు పూర్తిచేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన పట్నం పవన్(40) ఈ ఉదంతం ఈనెల 4న వెలుగుచూసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరిలోని రెడ్డివాడకు చెందిన పట్నం పవన్(40) జూన్ 21న అత్తగారి ఊరైన జనగామ జిల్లా షాగల్‌కు భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలతో కలిసి భువనగిరి నుంచి వెళ్లారు. మార్గమధ్యలో జనగామలో బస్సు దిగాక ఇక్కడ పనిఉంది, చూసుకొని వస్తాను అని అనడంతో భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. రెండురోజులు గడిచినా భర్త ఇంటికి రాకపోవడంతో భువనగిరిలోని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చింది. ఈ మేరకు అందరూ వెతికినా ఫలితం లేకపోవడంతో ఐదు రోజుల తర్వాత జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. కానీ అప్పటికే జనగామ మండలం యశ్వంత్‌పూర్ వద్ద పవన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం, జనగామ ఆస్పత్రి మార్చురీలో నాలుగు రోజులపాటు గుర్తుతెలియని మృతదేహంగా భద్రపరిచి అనంతరం పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో కల్పన భర్త ఆచూకీ కోసం ఈ నెల 4న(శుక్రవారం) జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా దర్యాప్తులో భాగంగా గుర్తుతెలియని మృతదేహంగా పేర్కొంటూ చూపిన ఫొటోల్లో భర్త పవన్‌ను గుర్తించింది. దీంతో సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేసింది. ఇదిలా ఉండగా ఫిర్యాదుసమయంలో పవన్ ఫొటోను జతచేయకపోవడంతో మృతదేహం గుర్తింపులో ఆలస్యం జరిగిందని జనగామ పోలీసులు పేర్కొన్నారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శనివారం జనగాంలో పవన్ మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జనగామ పోలీసులు తెలిపారు. తిరిగివస్తాడనుకున్న భర్త శాశ్వతంగా దూరం కావడంతో కల్పన కన్నీరుమున్నీరైంది.

గంజాయి కేసులో ఇరువురి అరెస్ట్

సూర్యాపేట క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో కోర్టుకు హాజరైన నిందితుడు అక్కడే పరిచయమైన మరో గంజాయి కేసుకు సంబంధించిన వ్యక్తితో బేరం కుదుర్చుకున్నాడు. అనుకున్న మేరకు కొనుగోలు చేసిన గంజాయిని మరో వ్యక్తికి విక్రయిస్తుండగా సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం దొరకుంటకు చెందిన ఆడప రాకేష్ గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. కుటుంబ పరిస్థితులు బాగాలేకపోవడంతో గంజాయి మానివేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. 2023లో కోదాడ పోలీసులు రాకేష్ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసులో 10 రోజుల కిందట సూర్యాపేట కోర్టుకు హాజరయ్యాడు. అక్కడే మరో గంజాయి కేసులో కోర్టుకు వచ్చిన ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తితో పరిచయమైంది. అతడిని రాకేష్ తక్కువ ధరకు గంజాయి కావాలని అడిగాడు. ఆ మేరకు జూన్ 29న ఒడిశా రాష్ట్రం కలిమెలలో శివమందిర్ వద్దకు వెళ్లి రూ.11 వేలకు 11 కిలోలు కొనుగోలు చేశాడు. దానిని తీసుకుని వచ్చి ఇంట్లో ఉంటే తన తల్లి గ్రహిస్తుందని దొరకుంట గ్రామ శివారులోని ట్రాక్టర్ షోరూం వెనుక ఖాళీ స్థలంలో చెట్లపొదల మధ్య దాచిపెట్టాడు. అనంతరం గంజాయి కొనుగోలు చేసే కోదాడ పట్టణం శ్రీరంగాపురం ప్రాంతానికి చెందిన వనపర్తి సాయికుమార్‌కు ఈ నెల 2న ఫోన్ చేసి గంజాయి ఉందని తెలిపాడు. ఈ నెల 4న మధ్యాహ్నం సాయికుమార్ గంజాయిని కొనుగోలు చేసేందుకు రాకేష్ వద్దకు వచ్చాడు. ఇద్దరు కలిసి దాచి పెట్టిన గంజాయి వద్దకు వెళ్లి ఇస్తుండగా సమాచారం అందుకున్న కోదాడ రూరల్, సీసీఎస్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి 11 కిలోల గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్పీ వివరించారు. గంజాయి విక్రయించే యువకులను పట్టుకున్న సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసులను ఎస్పీ అభినందించారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్, సీసీఎస్ ఎస్ఐలు అనిల్‌రెడ్డి, హరిక్రిష్ణ, సిబ్బంది చామకూరి శ్రీనివాస్, గోదేశి కర్ణాకర్, సతీష్, ఆనంద్, మల్లేష్, శివక్రిష్ణ, లింగరాజు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోదాడ సంత నుంచి హైదరాబాద్ కబేళాకు డీసీఎంలో తరలిస్తుండగా మండలంలోని లక్కారం జాతీయ రహదారిపై శనివారం పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. 11 ఆవులు, ఒక ఎద్దు ఉన్నాయని డ్రైవర్ ఈసారపు శ్రీను, కొరందాసు బాబీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అనుమతి లేకుండా పశువులను, జీవాలను తరలిస్తే కేసులు తప్పవన్నారు. జాతీయ రహదారిపై నిత్యం పోలీసులు తనిఖీలు చేస్తుంటారని ఆయన అన్నారు.

పోలీస్‌పహారా నడుమ అంత్యక్రియలు


రాములుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమారుడు శివ, గ్రామంలో మోహరించిన పోలీసులు

ఆత్మకూరు(ఎస్), జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బావ, బావమరిదికి పోలీస్‌పహారా మధ్య సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్‌లో శనివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఉదయం బావ ఐలయ్య, సాయంత్రం బావమరిది రాములు మృతదేహాలకు అంతిమసంస్కారాలు పూర్తి చేశారు. ఈ నెల 3న మోరాపాక భిక్షం మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు సూర్యాపేటలో ఉంటున్న గట్టికల్ వాసి ఐలయ్య వచ్చాడు. సాయంత్రం పనినిమిత్తం వెళ్తున్న భిక్షం మూడో కుమారుడు, మోనంది ఐలయ్య రోడ్డు ప్రమాదంలో గాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన గ్రామానికి చెందిన వినోద్ ఇంటి ఎదుట రాములు, ఐలయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి వరకు ఆందోళన నిర్వహించారు. పోలీసులు సర్దిచెప్పడంతో వెళ్లిపోయారు. శుక్రవారమే పోస్టుమార్టం పూర్తయిన ఐలయ్య మృతదేహానికి శనివారం మధ్యాహ్నం, శనివారం పోస్టుమార్టం పూర్తయిన రాములు మృతదేహానికి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు రోజుల్లో ఒకే కుటుంబంలో ముగ్గురికి..

గట్టికల్‌కు చెందిన భిక్షం కుమార్తెను అదే గ్రామానికి చెందిన మోనంది ఐలయ్యకు ఇచ్చి చేశాడు. సూర్యాపేటకు 15 ఏళ్ల కిందట బతుకుదెరువు కోసం వెళ్లిన ఐలయ్య మామ భిక్షం మృతి చెందడంతో వచ్చి బావమరిది రాములతో కలిసి వెళ్లి మృత్యువాత పడ్డాడు. అందరిదీ ఒకే గ్రామం కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం భిక్షం అంత్యక్రియలకు వచ్చిన బంధువులు శనివారం కూడా అక్కడే ఉండి రాములు, ఐలయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఒంటరైన చిన్నారులు

మోరపాక భిక్షం నలుగురు కుమారుల్లో మూడో వాడు రాములు. మూడేళ్ల కిందట భార్య చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. గతంలో తల్లిని, ఇప్పుడు తండ్రిని కోల్పోయిన చిన్నారులు ఒంటరివారయ్యారు. పిల్లలను చూసిన గ్రామస్థులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. పెద్దకుమారుడు శివ తండ్రికి తలకొరివి పెట్టాడు.

భారీ బందోబస్తు


ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడం, రోడ్డు ప్రమాదానికి గ్రామస్థుడే కారణం కావడంతో ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీకాంత్‌గౌడ్, బాలునాయక్, మహేష్, కనకరత్నంతో బందోబస్తు చేపట్టారు.

కాంగ్రెస్ నేత మృతితో విషాదంలో చెన్నాయిపాలెం


భార్య పిల్లలతో కుర్రి శ్రీను(ఫైల్‌ఫొటో)

మఠంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుర్రి శ్రీను(38) మృతితో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెన్నాయిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హైదరాబాద్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి కారులో వెళ్లి వస్తుండగా కారును లారీ ఢీకొట్టడంతో శ్రీను మృతి చెందాడు. అతడితో పాటు మాలోతు వీరన్న, మాలోతు చింటూ, నాగేశ్వరావు, బొజ్జ, సైదానాయక్, మాలోతు శ్రీను, మేఘాలకు గాయాలయ్యాయి. వీరన్నను తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన మరో 5గురుకి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అందరు ఒకే గ్రామానికి చెందినవారుకావడంతో చెన్నాయిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీను అందరితో కలివిడిగా ఉండటంతో ఆయన మృతిని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శ్రీను కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటా: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


శ్రీను మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, నకిరేకల్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుర్రి శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా కల్పించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం శ్రీను మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీను కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10లక్షలు ప్రకటించి, రూ.5 లక్షలు అందజేశారు. శ్రీను పిల్లల విద్య కోసం, భార్యకు ఉద్యోగ అవకాశం కోసం ప్రభుత్వంపరంగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించాలని గ్రామ నాయకులను ఆదేశించారు. మంత్రి వెంట నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు. శ్రీను మృతదేహాన్ని పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, ఆదూరి కిషోర్‌రెడ్డి, ఖరీం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్, ఓయూ జేఏసీ నాయకులు కృష్ణనాయక్, వంటిపులి శ్రీనివాస్, సక్రునాయక్, బాబునాయక్, కొండానాయక్ నివాళులర్పించారు.

గ్రామాల్లో పీర్ల సందడి

● నేడు మొహర్రం



(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్, పెద్దఅడిశర్లపల్లి, రాజాపేట): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకకు గ్రామాల్లో సందడి మొదలైంది. మొహర్రానికి తొమ్మిది రోజుల ముందు నుంచి పీర్లు (సవారీలు) నిలబెట్టి పూజలు నిర్వహిస్తారు. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా మొహర్రానికి తమ సొంత గ్రామాలకు తిరిగి వస్తారు. చివరి రోజైన ఆదివారం పీర్ల ఊరేగింపును పెద్దఎత్తున నిర్వహించనున్నారు. రాజాపేట మండలం పాముకుంట గ్రామంలో మొహర్రం పండుగను ఊరంతా కలసి ఆడంబరంగా జరుపుకుంటారు,

● మొహర్రం అసూరా

మహమద్ ప్రవక్త మనుమడు జమాము హుస్సేన్ కుటుంబం కర్బలా యుద్ధంలో చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా జిల్లా అంతటా ప్రతిష్ఠించిన పీర్లను మొహర్రం మాసం 10వ రోజు అసూరగా పాటిస్తూ ఆదివారం నిమజ్జనం చేయనున్నారు. పలువురు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో భువనగిరిలో మాతం ప్రదర్శన నిర్వహించనుండగా మరో 30 రోజులపాటు సంతాపదినాలు పాటించనున్నారు.

వారం ముందు నుంచే సందడి..

మొహర్రానికి వారం రోజుల ముందు పీర్లను నిలబెట్టడం ఆనవాయితీ. చాలా గ్రామాల్లో హిందువులే ఎక్కువగా జరుపుతుంటారు. వారం రోజుల ముందు పీర్లను నిలబెట్టి, ప్రతిరోజు రెండు మూడు పీర్లను లేపుతూ, భక్తి శ్రద్ధలతో ఎత్తుకొని ఊరేగిస్తారు. అల్వా చుట్టూ తిరుగుతూ ఆడిస్తారు. ఆరోజు అన్ని పీర్లతో కలిసి గ్రామమంతా భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పీర్లను నిలబెట్టగా, రాత్రి సమయంలో అల్వా ఆటలతో సందడి నెలకొంది. ఆదివారం పీర్లను జరపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అలవా ఆట.. ప్రత్యేక ఆకర్షణ

పీర్లు అనగానే అలవా ఆట అందరికీ గుర్తుకొస్తుంది. కట్టెలను ఒకచోట చేర్చి వాటిని మండించి ఆ మంట చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడటం ఈ పండుగలో ప్రధాన ఆకర్షణ. ముఖ్యంగా యువకులు ఈ అలవా ఆటల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. పీర్ల పండుగ చివరి మూడు రోజుల పాటు, ప్రతి రాత్రి గ్రామస్థులంతా ఒకచోట చేరి అలవా ఆడతారు.

అందరం కలిసి పండుగ జరుపుకుంటాం



మా గ్రామంలో ముస్లింలతో పాటు హిందువులు పండుగను జరుపుకుంటారు. మాతోపాటు తొమ్మిది రోజులు పాల్గొని రాత్రి పూట జరిగే అల్వా ఆటలో పాల్గొంటారు.అందరం కలసి పండుగ జరుపుకోవడం విశేషం.

ఎస్కే కరీం, పాముకుంట, రాజపేట మండలం

చైతన్యానికి ప్రతీక తొలి ఏకాదశి

● నేడు తొలి ఏకాదశి
● ముస్తాబైన ఆలయాలు



(ఆంధ్రజ్యోతి భూదాన్‌పోచంపల్లి) :ఏకాదశి ప్రజల్లో ఉండే చైతన్యానికి ప్రతీక. వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కనుక దీనిని తొలిఏకాదశి అని పండితులు చెబుతుంటారు.ఇక్కడి నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. అందుకే తొలి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేస్తారు. విష్ణువుకు సంబంధించిన ఆలయాల్లో ప్రత్యే క పూజలు నిర్వహిస్తారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు విష్ణుమూర్తి పాలసముద్రంపై ఆదిశేషుపాన్పుపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని 'తొలి ఏకాదశి'గా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబటి దీన్ని 'శయన ఏకాదశి' అని కూడా అంటారు.

రోజంతా ఉపవాసం

తొలి ఏకాదశి రోజంతా ఉపవాసం ఉండి, రాత్రికి జాగారం చేసి, మర్నాడు ద్వాదశి నాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే పాపాలు ప్రక్షాళనమవుతాయని నమ్మకం. ఆ రోజున యోగనిద్రకు ఉపక్రమించే విష్ణువు మళ్లీ నాలుగు నెలల తరువాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడని అంటారు. దాన్ని 'ఉత్థాన ఏకాదశి' అంటారు. ఆ తరువాత వచ్చే ద్వాదశినే 'క్షీరాబ్ధి ద్వాదశి' అని అంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని పవిత్రంగా పరిగణించి అందరూ చౌతుర్మాస్య దీక్ష స్వీకరిస్తారు. దీక్ష తీసుకున్న వారు నియమాలను ఖచ్చితంగా పాటిస్తారు. ముఖ్యంగా పీఠాధిపతులు చౌతుర్మాస్యదీక్షను స్వీకరిస్తారు. చతుర్మాస్యదీక్ష చేపట్టిన వారు నాలుగునెలల పాటు ప్రయా ణం చేయరు. కామక్రోదాలను విస్మరిస్తారు. ఆహారం విషయంలో కొన్ని నిషేధాలు పాటిస్తారు. జొన్న పేలాలు, బెల్లం కలిపి దంచి పిండి చేస్తారు. రైతులు ఆ రోజున కచ్చితంగా పేలపిండి తింటారు.

అనారోగ్య మాసం..

ఆషాడం అనారోగ్యమాసం. ఈదురుగాలులతో చినుకులు పడే సమయం. కొత్తనీరు తాగడం వల్ల చలిజ్వరాలు, విరేచనాలు, తలనొప్పి, రోగాలు వచ్చే సమయం. ఈ మాసంలో గోరింటాకు (మైదాకు) పెట్టుకోవడం ప్రత్యేకత. రోగ నిరోధకశక్తిగా, వేడిని తగ్గించే శక్తి మైదాకులో ఉంటుందనే భావన. నాలుగు నెలలు వర్షాకాలం సీజన్ కావడంతో క్రిమికీటకాలు పెచ్చరిల్లి తద్వారా వ్యాధుల పాలుకాకుండా ఇళ్ల నుంచి తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి ఎటూ ప్రయాణాలు చేయ దం శ్రేయస్కరం కాదని శాస్త్రీయ అర్థం.

ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

తొలి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కొన్ని దేవాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టపల్లి క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి

మఠంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలోని కృష్ణానది తీరంలో మట్టపల్లిలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం తొలి ఏకాదశి వేడుకలకు ముస్తాబైంది. ఈ ఆలయంతో పాటు కృష్ణా తీరాన వెలుగొందుతున్న వాడపల్లి, కీతవరం, వేద్రాద్రి, మంగళగిరి మొదలగు నృసింహ క్షేత్రాల్లో మట్టపల్లి మహాఖ్యాతి పొందింది. స్వయంభు వ్యక్తంగా వెలిసిన మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామిని భక్త జనకోటి తమ ఇష్టదైవంగా కొలుస్తుంటారు. మట్టపల్లి మహాక్షేత్రంలో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు ఉదయం విశ్వక్సేన పూజ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురారోపణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు పాలకవర్గం అన్నిఏర్పాట్లు పూర్తిచేసింది.

నేటి తొలి ఏకాదశి ఉత్సవాలు

మట్టపల్లి క్షేత్రంల నేడు తొలి ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. ఆలయాన్ని రకరకాల విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రంలోని అన్నికులాల వారు అన్నదానాలు చేసే సంప్రదాయం ఇక్కడ ప్రత్యేకం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగాకుండా హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిడుగురాళ్ల, మాచ ర్ల, తెలంగాణ నుంచి కోదాడ, మిర్యాలగూడ నుంచి ఆర్టీసీ సర్వీసులను ప్రత్యేకంగా నడపనున్నారు.

పనుల ఊసేదీ?

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కేటాయించినట్లు తెలుస్తోంది. కానీ పనులు చేపట్టాల్సిన ప్రభుత్వ శాఖలకే స్ప ష్టత కొరవడిందని సంబంధిత అధికారులు అంటుండటం గమన్హరం. ప్రతిపాదిత పను లు పూర్తయితే గుర్రపుడెక్క తదితర పిచ్చి మొక్కలు. మురుగునీరు. వ్యర్థాల తొలగింపుతో చెరువులు శుభ్రం కానున్నాయి. అంతేకాక చెరువులు ఆహ్లాదానికి చిరునామా మారే అవకాశాలు ఉంటాయి. అలాగే శుభ్రమైన నీటితో మత్స్య సంపద పెరిగే అవకాశాలుంటాయి. బోటింగ్ తదితర ఉల్లాస ఆటలకు అవకాశాలుంటాయి.

యాదాద్రిలో ఐదు చెరువులు.. రూ.14.50కోట్లు

యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. అయితే మోత్కూరు మినహా భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ చెరువుల అ భివృద్ధికి అమృత్ 2.0 పథకంలో చోటు లభించింది. యాదగిరిగుట్ట నల్లచెరువు అభివృద్ధికి రూ.1.50కోట్లు, మిగతా నాలుగు మునిసిపాలిటీల చెరువులకు రూ.3.14కోట్ల చొప్పున నిధు లు ప్రతిపాదించారు. అయితే అమృత్ 2.0 పనులను పర్యవేక్షిస్తున్న శాఖ అధికారులు భువనగిరి మునిసిపల్ కోటాలో రాయిగిరి చెరువు అభివృద్ధికి ప్రతిపాదించారు. కానీ వైటీడీఏ పరిధిలోని రాయిగిరి చెరువును ఈపాటికే అభివృద్ధి చేశారు. మునిసిపల్ అధికారులు మాత్రం భువనగిరి పెద్దచెరువు సంపూర్ణ అభివృద్ధికి ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. కానీ చెరువుల జాబితా, డీపీఆర్ ఖరారయ్యాకే పనులపై స్పష్టత రానుంది. వాస్తవానికి ఈపాటికే పట్టణాల చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పన్నులపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

చేనేత వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్



మార్కెటర్లకు జెడ్ ఫెసిలిటీస్ ఆఫర్ లెటర్ అందిస్తున్న పవన్, తడక వెంకటేష్

భూదాన్‌పోచంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ - జెడ్ సర్టిఫికెట్ ద్వారా చేనేత వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం లభిస్తోందని వీవర్ సర్వీస్ సెం టర్ ప్రతినిధి పవన్, చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు తడక వెంకటేష్ అన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని శ్రీరంజన్ ఇక్కత్ టైఅండ్‌డై ఆర్టిజన్ అండ్ వర్కర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ - జెడ్ సర్టిఫికెట్ల ధ్రువీకరణ కార్యక్రమాన్ని స్థానిక భద్రావతి నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ - జెడ్ ఫెసిలిటీగా ఎంపికైన ఎనిమిది మందికి ఆఫర్ లెటర్లను వారు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వీవర్ సర్వీస్ సెంటర్ ద్వారా చేనేత రంగం పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా రూపొందించిన జెడ్ ప్రాముఖ్యత గురించి వారు వివరించారు. చేనేత రంగంలోని ఉత్పత్తి విషయంలో పారదర్శకతతోపాటు ప్రమాణాలను పరివీలించే విధంగా జెడ్ సర్టిఫికెట్ ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. ఇది చేనేత వస్త్ర ఉత్పత్తిలో మార్కెటింగ్ నాణ్యతను పెంచుతుందన్నారు. తద్వారా మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడుతాయని అన్నారు. చేనేత కళాకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతి పథకాన్ని లబ్ధి పొందే విధంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం ప్రధాన మంత్రి సమర్ధ యోజన కింద శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తడక వెంకటేష్‌తోపాటు శ్రీరంజని యూనిట్ ప్రతినిధి ఎన్నం శివకుమార్, చేనేత నాయకులు సీత లక్ష్మణ్, కర్నాటి బాలరాజు, చింతకింది రమేష్, కర్నాటి పురుషోత్తం, భద్రావతి నగర్ కాలనీ అధ్యక్షుడు ఏలె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి మొలకలపై జీవధార



పత్తి మొలకలకు ట్రాక్టర్‌తో నీరు పడుతున్న రైతు మధు

మోత్కూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వరుణుడు ముఖం చాటేయడంతో పత్తి రైతులు విత్తిన విత్తనాలు కొన్ని మొలకెత్తగా, మరికొన్ని మొలకెత్తకుండా భూమిలోనే తలవొంచుకుని ఉండిపోయాయి. ఈ క్రమంలో యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన రైతు జక్కుల మధు వినూత్న ఆలోచన చేశాడు. తనకు ఉన్న ట్రాక్టర్‌కు పెద్ద ప్లాస్టిక్ ట్యాంకు అమర్చి దానికి రెండు పైపులు పెట్టి దాంతో శనివారం పత్తి మొక్కలకు నీరు పోశాడు. ఇప్పటికే రైతులు పత్తి, కంది చేలల్లో, తోటల్లో క్రిమి సంహారక మందులు ఇలా పిచికారి చేస్తున్నారు. అలానే ఆ రైతు ఆ పైపులకు నోజిళ్లు తీసేసి పైపులతో నేరుగా మొలకలకు నీరు పట్టాడు. మధు ట్రాక్టర్ నడుపుతుండగా అతని తల్లి దండ్రులు పైపులు పట్టుకుని నీరు పట్టారు. తాను ఐదెకరాల్లో పత్తి విత్తనాలు విత్తగా భూమి గట్టిపడి కొన్ని విత్తనాలు మొలకెత్తగా, మరికొన్ని మొలకెత్తకుండా తలవొంగిపోయి భూమిలోనే ఉండిపోయాయని రైతు మధు తెలిపాడు. రోడ్లపై నీళ్లు పోసే వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు పట్టాలని యత్నించి, అద్దె అడిగి లెక్కిస్తే ఖర్చు ఎక్కువ అవుతుండటంతో ఏం చేయాలా అని ఆలోచించగా ఈ ఆలోచన తట్టిందన్నాడు. సుమారు ఆరు గంటల్లో 4 ఎకరాలకు నీరు పట్టానన్నారు. సాయంత్రం చూసే సరికి ఉదయం నీరు పట్టిన సాళ్లలో మొలకెత్తకుండా భూమిలో ఉండిపోయ మొలకలు బయటకు వచ్చాయన్నారు. సుమారు రూ.వెయ్యి, పదిహేను వందల ఖర్చుతో మొలకను కాపాడుకోగలిగానన్నారు. వారం రోజుల్లో వర్షం కురిసినా మొక్కలు బతుకుతాయన్నారు.

వైభవంగా యాద గిరి ప్రదక్షిణ

● ప్రారంభించిన ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఈవో భాస్కరశర్మ
● కాలినడకన కొండెక్కిన భక్తజనం
● వైకుంఠద్వారం చెంత కూచిపూడి నృత్యం

యాదగిరిగుట్ట, జూలై 5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. ఆలయంలో వేకువజామున స్వాతి వేడుకలు గిరిప్రదక్షిణలో భక్తులు పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ కళాకారుల శాస్త్రీయ నృత్యాలు, భక్తుల భజనలు, కీర్తనలతో కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల్లో నిర్వహించారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసి మెట్ల దారిలో కొండెక్కే భక్తులకు 1500 ఉచిత దర్శన టికెట్లు అధికారులు పంపిణీ చేశారు. వేలాదిగా వాహనాలపై తరలివచ్చిన భక్తజనంతో వైకుంఠద్వారం నాలుగు వైపులా కిలోమీటర్ దూరంలో వాహనాలు పార్కింగ్ చేశారు. ప్రదక్షిణ చేసిన భక్తులు మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 25 వేల మంది భక్తులు పూర్తి చేసుకున్నారు. ప్రతీ నెలా స్వాతి నక్షత్రం రోజున జరిగే ప్రదక్షిణలో స్వామివారి నామస్మరణతో భక్తులు నిర్వహించారు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు బారీకేడ్లతో బందోబస్తు నిర్వహించారు.



గర్భాలయంలో ఉభయ కూలైన్లల్లో భక్తులు

ప్రదక్షిణ ప్రారంభించిన ఆర్డీవో, ఆలయ డీఈవో

శనివారం తెల్లవారుజామున 5.30గంటలకు అర్చకులు వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వా యిద్యాల నడుమ భువనగిరి ఆర్డీవో మాలి కృష్ణారెడ్డి, ఆల య డీఈవో భాస్కరశర్మ హారతి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం గిరి ప్రదక్షిణ ప్రారంభించింది. అంతకు ముందు వేకువజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణ మొదలుపెట్టారు. వైకుంఠద్వారం వద్ద ప్ర త్యేక వేదికపై శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్టు వారు మీనాక్షినివాస్ నేతృత్వంలో చేపట్టిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

శనివారం సెంటిమెంట్

యాదగిరిగుట్టపై స్వామివారిని శనివారం దర్శనం, గిరి ప్రదక్షిణ కలిసి రావడంతో సెంటిమెంట్‌గా భక్తులు భావించారు. కొంతమంది భక్తులు కాలినడకన మెట్ల దారిలో కొండపైకి ఎక్కారు. గర్భాలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉభయ కూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రూ.500 రుసుం చెల్లించి కొండపైకి చేరుకున్న వాహనాలతో బస్టాండ్ ప్రాంగణం పూర్తిగా నిండిపోయి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థానపరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, ఆలంకార మూర్తుల ను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేపట్టారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం జన్మనక్షత్రం సందర్భంగా స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి.

శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.26,96,858 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

స్వామి వారి సేవలో పలువురు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని తాజా, మాజీ ఎమ్మెల్యేల సతీమణులు శనివారం దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత కొండకింద వాహన పూజలు చేశారు. మల్కాజ్‌గిరి తాజా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మమత, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి సతీమణి కల్పన, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనిత వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్





● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

చెత్త తీసేశారు...



ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న సిబ్బంది

నల్లగొండ పట్టణానికి తాగునీటి అందించే ఎస్ఎల్‌బీసీ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మునిసిపల్ సిబ్బంది శుక్ర, శనివారం తొలగించారు. నీటి సరఫరా కోసం ఉన్న కాల్వలో కొందరు వ్యర్థ పదార్థాలు వేస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా కోళ్లకు సంబంధించిన వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ వేస్తుండడంతో నీటి నుంచి దుర్గంధం వస్తోంది. దీంతో గత నెల 23వ తేదీన 'కృష్ణాజలాలు కలుషితం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి కాల్వల్లో వ్యర్థాలను తొలగించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలను చిట్యాలలో ఏర్పాటు చేయాలి

చిట్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గానికి మంజూరైన రెండో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను చిట్యాల మండలపరిధిలో ఏర్పాటు చేయాలని స్వేరోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మిగతా మండలాల్లో పలు ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేశారు కాబట్టి చిట్యాల మండలంలో రెండో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

అందరికీ అందుబాటులో యూరియా

చండూరురూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చండూరు మండలంలో వానాకాలం సీజన్‌కు ఎలాంటి కొరత లేకుండా సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏవో చంద్రిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని పీఏసీఎస్‌లో 20.115మెట్రిక్ టన్నులు, ఎన్‌డీసీఎంఎస్ నందు 72.09, ఆగ్రో రైతుసేవా కేంద్రంలో 68.31, ప్రైవేట్ డీలర్ల వద్ద 322.56, మొత్తంగా దాదాపు 500 మెట్రిక్ టన్నుల వరకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

సమాచారం

నకిరేకల్‌లో నేత్రదానం

నకిరేకల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కందుల సోమయ్య సతీమణి శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామ మాజీ సర్పంచ్ సక్కుబాయమ్మ శుక్రవారం మృతి చెందగా నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కుటుంబ సభ్యుల కోరిక మేరకు నేత్రదానం చేశారు. నల్లగొండకు చెందిన ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరినాథ్ ఐబ్యాంక్ టెక్నీషియన్ జానీ ఆమె నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, వృద్ధాశ్రమం చైర్మన్ ఎస్.రామ్మోహన్‌రావు, క్లబ్ కార్యదర్శి ఎస్. సూర్యచందర్‌రావు, శివకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల అందజేత

మునుగోడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను ప్రోత్సహించటంతో పాటు విద్యపై నమ్మకం పెంచాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విద్యార్థులకు ప్రతిభ పుస్కారాలను అందించనున్నారు. ఈ నెల 6వ తేదీన ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలలోనే 'పంచాయతీ'



ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోతినేనిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

- పోతినేనిపల్లిలో ఒకే ప్రాంగణంలో నిర్వహణ
- జీపీ పక్కా భవనానికి ఎమ్మెల్యే హామీ
- సిద్ధం కాని స్థలం
- నూతన భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్

నార్కట్‌పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతినేనిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి పక్కా భవనం 'హామీ'గానే మిగిలింది. గ్రామపంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ఇటు 'పాఠశాల'ను....అటు 'పంచాయతీ'ని ప్రస్తుతం ఒకే ప్రాంగణంలోని భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన చిన్న గదిలోనే నేటికీ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని అసౌకర్యాల మధ్య కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి పాలకవర్గం లేకపోవడంతో పాఠశాలకు ఇప్పటికిప్పుడే వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ కొన్ని రోజులకైనా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పాటైతే తరుచూ సమావేశాలు, వివిధ పనులపై సర్పంచ్ లేదా వార్డుసభ్యులను కలవడానికి వచ్చే గ్రామస్థులు, గ్రామ సభల నిర్వహణ సమయాల్లో పాఠశాలలో తరగతుల నిర్వహణకు అసౌకర్యం ఏర్పడనుంది.

ఎమ్మెల్యే హామీ ఇచ్చినా....

గతేడాది పోతినేనిపల్లెలో తన సొంత ఖర్చుతో పాఠశాల పక్కనే ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రం ప్రారంభానికి ఎమ్మెల్యే వీరేశం వచ్చిన సమయంలో ఒకే భవనంలో ఇటు పాఠశాలను అటు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహించడం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిస్థితిని స్వయంగా చూసిన ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి పక్కా భవనం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల పక్కనే అందరికీ అనుకూలంగా ఉన్న గ్రామ కంఠం భూమిలో దాదాపు 25 సంవత్సరాల క్రితం నెదర్లాండ్ పథకం కింద ఏర్పాటు చేసిన డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను తొలగించి ఆ స్థలంలో కొత్త గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాలని కూడా సూచిస్తూ సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. కానీ నేటికీ ఆ డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను తొలగించలేదు. పైగా గ్రామ పంచాయతీకి పక్కా భవనం ఊసే మరిచారు. అయితే ఆ స్థలంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు పోగా మిగతా ఖాళీ స్థలంలో నర్సరీని నిర్వహిస్తున్నారు. కాగా ఈ నెల 3వ తేదీన నార్కట్‌పల్లిలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొత్త జీపీ భవనాల చర్చలో పోతినేనిపల్లి కూడా రావడం గమనార్హం.

ప్లాంట్ ఏ శాఖ పరిధిపై స్పష్టత లేదు



పోతినేనిపల్లి గ్రామ పంచాయతీకి పక్కా భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ఓ చిన్న గదిలో కొనసాగిస్తున్నాం. కొత్త జీపీ భవనానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మాట వాస్తవమే. కానీ కొత్త జీపీ కట్టేందుకు ఎంచుకున్న స్థలంలోని డీ ఫ్లోరినేషన్ ప్లాంట్ తొలగించాల్సిన బాధ్యత ఎవరిదో మాకు తెలియదు. వాస్తవానికి ఆ ప్లాంట్ ఏ డిపార్ట్‌మెంట్ పరిధిలో మాకు స్పష్టత లేదు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి, జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పష్టతకు వస్తాం. తదుపరి ఎమ్మెల్యే సూచన, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- కే.ఉమేష్‌చారి, ఎంపీడీవో, నార్కట్‌పల్లి

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలోనే...

మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ఉన్న డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను కూడా తొలగించే బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించారు. ప్లాంట్ స్థలంలో ఏదైనా ప్రభుత్వ కార్యాలయ భవనం నిర్మించాలని అప్పటి సర్పంచ్ శంకరయ్య సంకల్పించి అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంట్‌లోని ఇనుము, పరికరాలు, యంత్రాల విలువను అంచనా వేసి టెండర్ నిర్వహించి ప్లాంట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆ స్థలంలో పల్లె దవాఖానాను నిర్మించారు. కానీ పోతినేనిపల్లెలో మాత్రం అధికారుల అస్పష్టత కారణంగా గ్రా మస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను తొలగించి నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

ప్రతిభ పురస్కారాల అవార్డుకు 21 మంది విద్యార్థుల ఎంపిక

మర్రిగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు సాధించిన 21 విద్యార్థులు ప్రతిభా పురస్కారాల అవార్డుకు ఎంపికైనట్లు మర్రిగూడ ఎంఈవో బిట్టు శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తల్లి గారైన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఈ పురస్కారాల అవార్డు కు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ ప్రతిభా పురస్కాల అవార్డు ఆదివారం మునుగోడు నియోజకవర్గంలోని క్యాంప్ కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థిని, విద్యార్థులకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ పురస్కార అవార్డును అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపటివరకు అభ్యంతరాల స్వీకరణ

నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ లో ప్రత్యేక అధికారులు, పీజీసీఆర్‌టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్ పోస్టులతో పాటు అదేవిధంగా టీజీ ఎంఎస్ జీహెచ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థులు ఎంపిక చేసినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ఈ నెల 7వ తేదీ వరకు ఫిర్యాదులు చేయాలని డీఈవో భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. 1:1 నిష్పత్తిలో సబ్జెక్టుల వారీగా అభ్యర్థులు జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందు పరిచామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను జూన్ 30వ తేదీన పరిశీలించామని పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున

చిట్యాల, నకిరేకల్, కనగల్, నార్కట్‌పల్లి, నల్లగొండరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో చిట్యాలలో మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ్మా, అరూరి శ్రీను, బొబ్బల సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటెపాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు దఫాలుగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తడువాయి రాములు, బాత్క సైదులు, సూరారపు వీరయ్య, వంటెపాక రమేష్, నాగార్జున పాల్గొన్నారు.

● కనగల్‌లో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి వివిధ ప్రజా సంఘాల నాయకులతో సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 18 రకాల డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటంలో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి, ప్రజా సంఘాల నాయకులు కందుల సైదులు, అక్రమ్, పినపురెడ్డి శేఖర్‌రెడ్డి, మునగాల ఈదయ్య, ఎరుకల నాగులు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనికోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చింతపల్లి బయ్యన్న, చెర్కు పెద్దులు, దండు రవి, జాల యాదమ్మ, బొల్లెద్దు సైదులు, అర్ధం శ్రీనివాస్, సైదులు, మహ్మద్‌అలీ, రమేష్, నర్సింహ, మల్లేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

● నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు, పేదల శ్రమను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం పాలకులు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, కుమ్మరి శంకర్, నాయుకులు కొండ వెంకన్న, పోలే సత్యనారాయణ, కోట్ల అశోక్‌రెడ్డి, బొల్లు రవీందర్ కుమార్, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రేషన్‌కార్డులు

శాలిగౌరారం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులను మంజూరు చేస్తుందని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి సమీపంలోని మాలిపురంలో జూలై 14వ తేదీన నిర్వహించే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ రేషన్‌కార్డుల పంపిణీ బహిరంగ సభకు యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తరలిరావాలని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులను పేదలకు ఇవ్వలేదని అన్నారు. శాలిగౌరారం మండలవ్యాప్తంగా సుమారు దాదాపు 1312మందికి నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. సుమారు 2100 మంది యాడింగ్ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు లబ్ధిదారులు ప్రజలు తరలిరావాలన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చిట్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని చిట్యాల మునిసిపాలిటీలోని పదోవార్డు వాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల చుట్టూ కాలుష్యం వెదజల్లుతున్న ఎంపీఎల్ పరిశ్రమతో పాటు రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు వెదజల్లే పొగ, దుమ్మతో రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు చికిలంమెట్ల అశోక్, బొబ్బల శివశంకర్‌రెడ్డి, కమ్మర దేవి, ముప్పిడి కవిత, తంగళ్లపల్లి అరుణ, చొల్లేటి కళావతి, మాస మౌనిక, మందడి కృష్ణవేణి, దుబ్బాక స్వప్న, మిట్టపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండల పరిధిలోని ఖాజీ రామారం గ్రామ పరిధిలో అక్రమంగా లే అవుట్లు చేసి వాణిజ్య, ఇళ్ల స్థలాలను విక్రయిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాలకూరి రవి కోరారు. శనివారం మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఖాజీరామారంలోని సర్వే నెంబరు 23, 24, 26 గల భూమిలో చేసిన లే అవుట్లకు ఎలాంటి అనుమతి లేకుండా, నాలా కన్వర్షన్ చేయకుండా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● నషాముక్త్ భారత్ అభియాన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ అంజిరెడ్డి



డ్రగ్స్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గూడూరు అంజిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నషాముక్త్ భారత్ అభియాన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి సూచించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్‌లో భాగంగా శనివారం నార్కట్‌పల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలలో డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల జీవితం ఏ విధంగా నాశనమవుతుందో కొన్ని యథార్థ ఘటనలను ఉదాహరించి విద్యార్థుల్లో ఆలోచన రగిలింపజేశారు. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే ఉత్తమమైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసలై యువకులు కొందరు తమ విలువైన జీవితాలను చీకటిమయం చేసుకుని తల్లిదండ్రులకు తీరని బాధను మిగిలిస్తున్నారని అంజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, భార్గవి, వీరయ్య, ప్రియాంక, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



రాంచందర్‌రావును సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

నల్లగొండరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావుని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, నల్లగొండ అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, యువమోర్చా నాయకులు సాగర్ల లింగయ్య, దుబ్బాక సాయి, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి కాపాడాలి

● ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



రాములబండ పీహెచ్‌సీలో డాక్టర్లతో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి

నల్లగొండరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సేవలు అందించి సీజనల్ వ్యాధుల ప్రజలను కాపాడాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ మండ లంలోని రాములబండ గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలోని ఏరియా ఆస్పత్రుల్లో తమ సంఘం ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాక కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖానాలలో అన్ని రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, రాములబండ పీహెచ్‌సీలో 10 పడకల ఆసుపత్రిగా మార్చి 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఆశా వర్కర్లకు ఇతర సిబ్బందికి నెలల తరబడి జీతాలు రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ పాల్గొన్నారు.



నల్లగొండలో సర్వే నిర్వహిస్తున్న ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ

పీహెచ్‌సీలను బలోపేతం చేయాలి

నల్లగొండ పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలను, ఏరియా ఆస్పత్రులను బలోపేతం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని పానగల్, మాన్యంచెల్క, లయన్‌వాడ ఆస్పత్రులను ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాన్యం చెల్క ఆస్పత్రికి సొంతభవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, శృతి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి

మునుగోడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని డీసీసీబీ మేనేజర్ దీప్తి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. వనమహోత్సవంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బ్యాంక్ మేనేజర్ నరేష్, సంఘం కార్యదర్శి సుఖేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే

శాలిగౌరారం, జూలై 5(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం లయన్స్ అధ్యక్షుడిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన గుజలాల్ శేఖర్‌బాబును మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులును కూడా సన్మానించారు. క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి గుర్తింపు పొందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, దుబ్బ వెంకన్న, బాకీ వెంకన్న, బట్ట వీరబాబు, రాపాక రాజు, నిమ్మల సురేష్, తీగల వెంకన్న పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

(5వ పేజీ తరువాయి)

, 36.3శాతం వర్షపాతం లోటు ఉంది. అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో 757.7మి.మీల వర్షపాతం నమోదైంది. ఈ డివిజన్‌లో 70.9మి.మీల అధిక వర్షపాతం నమోదైంది. గుడిపల్లి, గుర్రంపోడు మండలాలు మినహా అన్ని మండలాల్లో సాగుకు ఉపయోగపడేలా వర్షం కురిసింది. చండూరు డివిజన్‌లో 491.3మి.మీల వర్షపాతం నమోదు కాగా, ఇంకా 5.8మి.మీల లోటు ఉంది. జిల్లా వ్యాప్తంగా సగటున ఇంకా 11.6మి.మీల వర్షపాతం లోటు ఉంది. ఈ వర్షాలు మెట్ట పంటలకు మేలు చేకూర్చినా, ఇంకా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో బోరు బావుల్లోకి నీరు రాలేదు.

పెరిగిన యూరియా వాడకం

జిల్లాలో యూరియా వాడకం పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు యూరియాను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 57,270మెట్రిక్ టన్నులకు పైగా ఎరువుల నిల్వలు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. యూరియా గోదాంలో 1,767మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా, 13,015మెట్రిక్ టన్నులు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఉంది. అదేవిధంగా రిటైల్ వ్యాపారుల వద్ద 9,155 మెట్రిక్ టన్నులు ఉంది. మొత్తంగా ప్రస్తుతం 24,929మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉంది. జూలై నెలకు అవసరానికి అనుగుణంగా యూరియాను నిల్వచేశారు. డీఏపీ 2,926 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 2,269మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకేఎస్ 25,580మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఎస్ఎస్‌పీ 1,425మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌వోఎం 35మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ప్రధానంగా యూరియాను పత్తి పంటకు అధికంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎరువులను మండలాల వారీగా అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉంటే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం ఎరువుల నిల్వలను పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం మెట్ట పంటలకు బోరు బావుల కింద వరి సేద్యానికి నాగార్జున సాగర్ ఆయకట్టు కింద నాట్లతో పాటు రానున్న రోజుల్లో నీటి విడుదల జరిగితే అందుకు అవసరమైన ఎరువుల ఇండెంట్‌ను వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు.



పొలంలో ఎరువు చల్లుతున్న రైతు


కాంగ్రెస్ ఆకారం అధ్యక్షుడిగా యాదయ్య

శాలిగౌరారం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఆకారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇంద్రకంటి యాదయ్యను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తల తీర్మానం మేరకు ఇంద్రకంటి యాదయ్యను గ్రామ అధ్యక్షుడిగా నియమించినట్లు సమరంరెడ్డి తెలిపారు.

ఆయన నిర్మాణ పనుల పరిశీలన

గట్టుప్పల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపేట గ్రామపంచాయతీ పరిధిలోని సోమరాజు గూడ సోమేశ్వరాలయ దేవాలయాన్ని నిర్మాణదాతలు కుంభం సత్యనారాయణరెడ్డి పద్మమ్మ కుమారుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రీతి ఎన్ఆర్ఐ శనివారం కుటుంబ సమేతంగా దేవాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అయితగోని భుజంగం, వీరమల్ల అశోక్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 34.5
కనిష్ఠం 21.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 6 జూలై 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	524.70 (157.9860)	56,718	4,496
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	208.56	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.215 (20.3903)	నిల్	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో శనివారం సామూహిక గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. ఆలయంలో వేకువజామున స్వాతి వేడుకలు, గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల్లో ప్రదక్షిణ చేశారు.

7

నేడు మొహర్రం



మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకకు సర్వం సిద్ధమైంది. తొమ్మిది రోజుల ముందు నుంచే పీర్ల సందడి నెలకొనగా, ఆదివారం అలావ ఆడి ఊరేగింపు నిర్వహిస్తారు. అందుకోసం పల్లెలు, పట్టణాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదేవిధంగా భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.

7

చైతన్యానికి ప్రతీక తొలి ఏకాదశి



ప్రజల్లో ఉండే చైతన్యానికి ఏకాదశి ప్రతీక. వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కావడంతో తొలిఏకాదశిగా పిలుస్తారు. ఈ ఏకాదశి నుంచే పండుగలు ఆరంభమవుతాయి. అందుకే తొలి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేస్తారు. విష్ణువుకు సంబంధించిన ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

అమృత్ 2.0 పనుల ఊసేదీ?

▸ పథకం కింద పట్టణ చెరువుల అభివృద్ధికి నిధులు ▸ డీపీఆర్‌కే పరిమితమైన ప్రతిపాదనలు



పట్టణాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తోంది. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు పనులకు నిధులు మంజూరయ్యాయి. అయితే సంవత్సరాలు గడుస్తున్నా ప్రతిపాదిత పనులు మాత్రం డీపీఆర్ దశలోనే ఉండడంతో పథకం అమలు మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కు చందంగా తయారైంది.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా అమృత్2.0 కింద పనులు సాగుతున్నాయి. భవిష్యత్‌లో పట్టణాల విస్తరణ, జనాభాకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు 18 మునిసిపాలిటీల్లో రూ.450 కోట్లతో ట్యాంకులు, పైపులైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అదే సమయంలో 15 మునిసిపాలిటీలలోని 16 చెరువుల అభివృద్ధికి అమృత్ 2.0లోనే సుమారు రూ.50 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదిత అభివృద్ధి పనులు డీపీఆర్ దశ దాటలేదని తెలుస్తోంది. దీంతో చెరువుల శుభ్రం, సుందరీకరణ, చెరవు కట్టల బలోపేతం తదితర పనుల్లో జాప్యం నెలకొన్నది.

16 చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 19 మునిసిపాలిటీలున్నాయి. ప్రతీ మునిసిపాలిటీలో ఒక్కో చెరువును అమృత్ 2.0లో అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే సాంకేతిక, ఇతర కారణాలతో 15 మునిసిపాలిటీల పరిధిలోని 16 చెరవుల అభివృద్ధికి మాత్రమే అమృత్ 2.0 కింద సుమారు రూ.50కోట్ల వ్యయంతో ప్రతిపాదించారు. నల్లగొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో ఒకటి చొప్పున మునిసిపాలిటీల చెరువులకు అభివృద్ధి జాబితాలో చోటుదక్కలేదు. కానీ నల్లగొండ మునిసిపల్ పరిధిలో రెండు చెరువులకు అవకాశం కల్పించారు. అయితే తాగునీటి పనులు ప్రారంభమై సుమారు ఏడాదిన్నరపైగా గడుస్తున్నా చెరువుల అభివృద్ధి ఊసే మరిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పలు చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని ప్రతిపాదించగా తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా ఆ హామీలను నెరవేరుస్తామని ప్రభుత్వమిచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేరని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0పథకంలో ప్రతిపాదించిన చెరవుల అభివృద్ధి పనులు డీపీఆర్ పరిధిలోనే ఆగడం గమనార్హం. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది.

పనులు ఇలా..

అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణ చెరువుల అభివృద్ధికి ప్రతిపాదించారు. ఈమేరకు చెరువుల శుభ్రం, తిరిగి అపరిశుభ్రత కాకుం డా శాశ్వత నివారణ చర్యలు, చెరువు కట్ట బలోపేతం, సుందరీకరణ, ఫుట్‌పాత్, లైటింగ్, ఎంటర్‌టెయిన్‌మెంట్ పార్క్ తదితర పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం చెరవు విస్తీర్ణం, స్థానిక ఆవశ్యకత ఆధారంగా ..

- మిగతా 7వ పేజీలో...

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



ఇటీవల కురిసిన మోస్తారు వర్షాలతో మెట్ట పంటలు గట్టెక్కాయి. జూన్ నెల మొత్తం వరుణుడు ముఖం చాటేయగా, జూలై మొదటి వారంలో ముసురు నుంచి మోస్తరు వర్షాలు పత్తి పంటకు ఊపిరి పోశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా కురిసిన వర్షాలతో రైతులు ఊరట చెందారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

▸ ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి చేలకు ఊపిరి
▸ ఇప్పటి వరకు 3లక్షలకు పైగా ఎకరాల్లో పత్తిసాగు
▸ పెరిగిన యూరియా వాడకం

జిల్లాలో ఈ సీజన్‌లో అత్యధికంగా మునుగోడు నియోజకవర్గంలో 90వేల ఎకరాల్లో పత్తిసాగు చేయగా, దేవరకొండ నియోజకవర్గంలో 80వేల ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాల్లో ముందస్తుగా పత్తి విత్తనాలు విత్తారు. ఇవి మొలకెత్తగా, ఆ తరువాత వరుణుడు ముఖం చాటడంతో రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో కురిసిన వర్షాలు పంటలకు జీవం పోశాయి. వర్షాలు కురిసిన తరువాత మరో 70వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఈనెల 15వ తేదీ వరకు పత్తి విత్తనాలు విత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరో మూడున్నర లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పాటికే పత్తి చేలు ఏపుగా పెరగాల్సి ఉండగా, వర్షాలు లేక ఆలస్యంగా విత్తనాలు వేసే పరిస్థితి ఏర్పడింది. గత నెలలో మొక్కలు అన్నీ వాడుపట్టగా, చాలా మంది రైతులు పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేశారు. ప్రస్తుతం అవి మొలకెత్తుతుండటంతో రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

ఆలస్యంగా వర్షాలు కురవగా, ప్రస్తుతం రైతులంతా పొలం బాట పట్టారు. ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తిన చేలల్లో గుంటుక తోలి ఎరువు లు వేస్తున్నారు. గత నెలలో విత్తనాలు విత్తని రైతులు ప్రస్తుతం పత్తి విత్తనాలు విత్తుతున్నా రు. మే నెలాఖరులో కురిసిన వర్షాలతో అప్పటి కే విత్తనాలు తెచ్చుకున్న రైతులు వర్షాలు లేక నష్టపోతామని ఆందోళన చెందగా, తాజాగా కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలతో పాటు వరి నారు విరివిగా పోస్తున్నారు. అయితే బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లేక కొద్ది కొద్దిగా నీరు పోస్తున్నాయి. వర్షాలు భారీగా కురిస్తేనే ఎండిన బోర్లు మళ్లీ నీరు పోసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వరి నార్లు పోసుకున్న రైతులు పొలాలను దమ్ము చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి కే 5వేల ఎకరాల్లో వరినార్లు పోసిన రైతులు నా ట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నల్లగొండ డివిజన్‌లో ఇప్పటి వరకు 900.5మి.మీల వర్షం కురవగా, 8.5శాతం లోటు వర్షపాతం ఉంది. మిర్యాలగూడ డివిజన్‌లో 863.9మి.మీల వర్షపాతం నమోదు కాగా

- మిగతా 8వ పేజీలో...

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. జూలై నెలాఖరు వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి. ప్రతీ రోజు ఎరువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకూడదు. వర్షాలు కురవడంతో యూరియా వాడకం పెరిగింది. పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియాతో పాటు ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాం.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

విపత్తుల నిర్వహణ అందరి బాధ్యత

జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్

నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణ అందరి బాధ్యత అని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలు, తుపానులు, భూకంపాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు జాతీయ విపత్తులు, రాష్ట్ర విపత్తుల బృందాలు అక్కడికి చేరుకునేలోగా సహాయంగా ఉండేందుకు అన్ని జిల్లాల్లో ఆపద మిత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతీ శాఖ కార్యాచరణ రూపొందించాలని, దీనికి నెలాఖరులోగా రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ఆమోదం పొందాలన్నారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ అధికారి గౌతమ్ మాట్లాడుతూ, విపత్తు నివారణకు జిల్లా స్థాయిలో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ఆపద మిత్రులకు మూడో విడతల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. సమావేశంలో అథారిటీ అండర్ సెక్రటరీ అభిషేక్ బీస్వాల్, వసీం ఇక్బాల్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణకు సన్నద్ధం: కలెక్టర్

విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం విపత్తుల నిర్వహణ అథారిటీ బృందం అధికారులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, పోలీస్‌శాఖ తరఫున 12వ బెటాలియన్‌లో 80 నుంచి 100మందికి విపత్తుల నిర్వహణపై శిక్షణ ఇచ్చామన్నారు.వారి వెంట అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్,ఆర్డీవోఅశోక్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ఉన్నారు.

బాలసదన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

జిల్లా కేంద్రంలోని పానగల్ రోడ్డులో రూ.1.34కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాలసదన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. బాలసదన్ ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. అదనపు బ్లాక్‌ల నిర్మాణానికి రూ.60లక్షల అదనపు బడ్జెట్ కావాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి కలెక్టర్‌ను కోరగా, ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ఆదేశించారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

సాయిబండా తండా గిరిజన రైతుల వేడుకోలు

మర్రిగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మా భూములు మాకు ఇప్పించాలని కోరుతూ ఖుదాభక్షిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయిబండా తండా గిరిజన రైతులు కోరారు. శనివారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 38 నుంచి 44, 49, 40లలో 700 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్నామని తెలిపారు. 2005లో ఆకుల రాజయ్య మమ్మల్ని మభ్యపెట్టి భూములను తక్కువ ధరకు తీసుకున్నాడని ఆరోపించారు. అప్పటి నుంచి భూముల కోసం ఆందోళన చేస్తున్నామని, ఆ క్రమంలోనే రాజయ్య 2006 నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు విక్రయించాడని తెలిపారు. 2018లో ఆ భూములను శివరాత్రి చంద్రయ్య కంపెనీ పేరిట కొనుగోలు చేశారని, ఇప్పటికి కూడా మేమే వ్యవసాయం చేసుకుంటున్నామని అన్నారు. పొలాల్లోకి వెళితే మమ్మల్ని బెదిరిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా విషయాన్ని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ట్రిబ్యునల్ కోర్టులో రైతులకే అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. మా భూములు మాకు దక్కకుండా కొనుగోలు చేసిన కంపెనీ యాజమాన్యం కుట్ర చేసిందని ఆరోపించారు. గిరిజన రైతులనే చులకన భావంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము సాగు చేసుకుంటున్న భూములు మాకు దక్కేలా సహకరించాలని తహసీల్దార్ కోరినట్లు రైతుల వెల్లడించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పనులు త్వరగా పూర్తి చేయాలి



నాంపల్లిలో లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం

నాంపల్లి, జూలై5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం సభ్యులు సలీం కుమార్, సలీం మోహన్ అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. కేంద్ర నిధుల నుంచి అమలవుతున్న వితంతు, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలకేంద్రంలో గల నర్సరీలు, గ్రామపంచాయతీ కార్యాలయంలో గల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నవీన్ కుమార్, ఏపీడీ యామిని, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీవో ఝాన్సీ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీవో వినోద్ కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ ఉదయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంజి వెంకటేశం తదితరులు ఉన్నారు.

గట్టుప్పల్: మండలకేంద్రంలో చేపట్టిన పనులను కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసింది. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, సామూహిక ఇంకుడు గుంతలు, తదితర పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి టి.అశోక్‌రెడ్డి, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ ఖాజా మొయినొద్దీన్, ఎంపీడీవో జె.మాధవరెడ్డి, వెంకన్న, ఎండీ షఫీ, కె.శివగౌడ్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యో తి): విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థ ల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందుకోసం బీసీలంద రూ ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని యాద వ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. తెలంగాణ హైకోర్టు సెప్టెంబరు 30వరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇచ్చినందున బహుజన వర్గాలు గ్రామస్థాయి నుం చి ఉద్యమించాలన్నారు. సమావేశంలో పిల్లి రామరాజు యాదవ్, కొండూరు సత్యనారాయణ, వంగూరు లక్ష్మీనారాయణ యాదవ్, పందుల సైదులు, మాదగోని భిక్షపతి, పొట్టబత్తుల సత్యనారాయణ, బాలాజీ, మోహన్, ఆంజయ్య, శ్రీనివాస్, శివ, నాగరాజు, హరిబాబు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీమాతకు ప్రత్యేక పూజలు

చింతపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి):ఆషాఢ శుద్ధ దశమిని పురస్కరించుకొని మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని రాజరాజేశ్వరిమాతకు మహిళలు ఒడి బియ్యాలు పోశారు. అనంతరం మహిళలు గోరింటాకు చేతులకు పెట్టుకొని సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, ఆలయ కమిటీ ఛైర్మన్ పూరె శ్రీదేవి లక్ష్మణ్, సంతోషిమాత సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): యాద్గార్‌పల్లి గ్రామ శివారులో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వచ్చే కనెక్షన్ పనులు చేపట్టనున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అమర్‌సింగ్ శనివారం తెలిపారు. వాణిజ్య, వ్యవసాయ, గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని విద్యుత్ ఏఈ కోరారు.

అలంకరణపై పెరిగిన ఆసక్తి

» గ్రామీణ ప్రాంతాల్లోనూ బ్యూటీపార్లర్లు » ఉపాధితో పాటు ఆదాయం





(ఆంధ్రజ్యోతి-చింతపల్లి): నలుగురిలో ఉన్నప్పుడు మహిళలు తాము ప్రత్యేకంగా కనిపించాలనుకోవడం సహజం. ఈ ఆలోచనతోనే అలంకరణపై చాలా శ్రద్ధ వహిస్తుంటారు. ఇటీవల అలంకరణపై ఆసక్తి అందరిలోనూ పెరిగింది. ఈ నేపథ్యంలో అలంకరణ చేసే బ్యూటీపార్లర్ల ఏర్పాటు గ్రామీణ ప్రాంతాలకు పాకింది. ఎవరికీ వారు సౌందర్యంగా కనిపించాలన్న తపనతో ఈ పార్లర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆధునిక సౌకర్యాల మధ్య బ్యూటీపార్లర్లు దర్శనమిస్తున్నాయి. కొందరు దీనినే ఉపాధిగా మలుచుకుని పార్లర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల కాలంలో నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో సుమారుగా 10 బ్యూటీపార్లర్లు నెలకొన్నాయి. మండల కేంద్రంతో పాటు వీటీనగర్‌లో బ్యూటీపార్లర్లు ప్రారంభించి అలంకరణలో తమ ప్రతిభను చాటుతున్నారు. కొద్ది పాటి శిక్షణతో మహిళలు స్వయం ఉపాధికి ముందడుగు వేస్తున్నారు.

ప్రస్తుతం బ్యూటీషియన్ చేతిలో అందంగా అలంకరణ కాకుండా పెళ్లికుమార్తె ముస్తాబవుతున్న పరిస్థితి లేదు. మొహందీ మొదలు కేశాలంకరణ, పూలజడ,లగ్గం,చీర, నుదిటిపై కుంకుమ మొదలు మూడుముళ్ల సూత్రం వరకు పెళ్లికుమార్తెలు బ్యూటీషియన్ సూచనలు పాటిస్తున్నారు. ప్రాథమిక శిక్షణతో కుటుంబానికి ఉపాధి లభిస్తుండటంతో బ్యూటీషియన్‌గా స్థిరపడేందుకు యువతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లో ఐదారు నెలలు శిక్షణ పొంది మండల కేంద్రాల్లో బ్యూటీపార్లర్లను నెలకొల్పుతున్నారు. ఆర్థికంగా స్థిరపడుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు.

సృజనాత్మకత అవసరం

సౌందర్య రంగంలో రాణించాలంటే సృజనాత్మకత చాలా అవసరం. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా తగిన సాధనాలు సమకూర్చుకోవాలి. ఇష్టంతో ఈ రంగాన్ని ఎంచుకొని హైదరాబాద్‌లో నివాసముంటూ ఏడాది శిక్షణపొందా. తర్వాత చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో బ్యూటీపార్లర్ ప్రారంభించా. ప్రస్తుతం బాగానే నడుస్తుంది. కుటుంబ పోషణకు సరిపడా డబ్బులు వస్తున్నాయి. దీంతో పెళ్లి లో సైతం కోలాట నృత్యాలు నిర్వహిస్తున్నా.

-మల్లీశ్వరి, పూజ బ్యూటీపార్లర్, వీటీనగర్

స్వయం ఉపాధి పొందుతున్నా..

డిగ్రీ పూర్తి చేసిన నేను ఉద్యోగం కోసం వేచి చూడకుండా ఆరు నెలలు హైదరాబాద్‌లో బ్యూటీషియన్‌గా శిక్షణ పొందా. అనంతరం చింతపల్లి మండల కేంద్రంలో బ్యూటీపార్లర్ ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతున్నా. ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా నావృత్తిలో చాలా సంతృప్తిగా ఉంది.ఎక్కడ పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగినా వెళ్లి వారిని సౌందర్యంగా తయారు చేస్తున్నా. సమాజంలో అందానికి ప్రత్యేక స్థానం ఉందని కృషి చేస్తున్నా.

- సరిత, స్నేహ బ్యూటీ పార్లర్ చింతపల్లి.

అభివృద్ధికి సహకరించాలి

● సుజాత, ఎంపీడీవో, చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

మండల అభివృద్ధిలో ప్రజల సహకారించాలని ఎంపీడీవో సుజాత అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని, పారిశుధ్య పనులకు తగిన ప్రణాళిక తయారు చేసినట్లు శనివారం ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో తెలిపారు. (ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: వేంకటేశ్వర నగర్(మాల్) రహదారి మధ్యలో డివైడర్ భాగంలో చెత్త వేస్తున్నారు? వేయకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: డివైడర్ మధ్యలో చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తాం. వ్యాపారస్థులు, ప్రజలు చెత్త సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో సీసీ రోడ్డు, కాల్వలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. నెలల తరబడి నిల్వ ఉండటం వల్ల ప్రజలకు వ్యాధులు సోకే అవకాశం ఉంది. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

ఎంపీడీవో: ఉపాధి హామీ పథకం నిధులుతో త్వరలో సీసీ రోడ్లు నిర్మిస్తాం. వెంటనే సీసీ రహదారుల ఏర్పాటు చేస్తాం. మురుగు కాల్వల నిర్మాణాకి టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. నిధులు మంజూరైతే కాల్వలు నిర్మిస్తాం.

ఆంధ్రజ్యోతి: మండలంలోని గొడకొండ్ల, వీ.టీ.నగర్, ఎం.మల్లేపల్లి, పోలేపల్లిరాంనగర్, మదనాపురం, తక్కళ్లపల్లి, పి.కే.మల్లేపల్లి, చాకిలిశేరుపల్లి, ఉమ్మాపురం, తదితర గ్రామాల్లో జనావాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటుంది. వాటిపై ఎలాంటి చర్యలు చేపడుతారు ?

ఎంపీడీవో: మురుగుకాల్వల కోసం నిధులు ఇంకా మంజూరు కాలేదు. వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: వన మహోత్సవంలో ఎన్ని మొక్కలు నాటుతారు?

ఎంపీడీవో: మండలంలో అన్ని గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. చింతపల్లి మండలంలో 1, 15, 200 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలి : కమిషనర్



ఆస్తి పన్ను రశీదు అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్

మిర్యాలగూడ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణ ప్రజలు ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ కోరారు. కార్యాలయంలో శనివారం ఏ ర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పనుల నిర్వహణతో పాటు పట్టణాభివృద్ధికి అవసరమయ్యే వనరులు పన్నుల రూపంలోనే సమకూరుతాయన్నారు. దుకాణాదారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవడంతో పాటు రుసుంచెల్లించాలని కోరా రు. మొండి బకాయిదారులను నోటీసులు జారీ చేశామని తెలిపిన కమిషనర్ స్పందించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏ వెంకన్న, జ్ఞానేశ్వరి, శ్వేత, చరణ్‌తేజ పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లించాలని నోటీసులు

● హిల్‌కాలనీ, ఫైలాన్ కాలనీ ఇళ్ల యజమానులకు అందజేత

నాగార్జునసాగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, ఫైలాన్ కాలనీల్లో బీ అండ్ ఆర్‌కు సుమారు 1,350 నివాస గృహాలు ఉన్నాయి. అందులో గత ప్రభుత్వ హయాంలో జీవో నంబరు 58,59 ప్రకారం 500 ఇళ్లను క్రమబద్ధీకరించారు. వారికి ప్రభుత్వం పట్టాలను కూడా అందజేసింది. ఇది జరిగి దాదాపు సంవత్సర కాలం గడిసింది. కానీ ప్రస్తుతం బీ అండ్ అర్ అధికారులు క్రమబద్ధీకరించిన నివాస గృహాలకు గతంలో ఉన్న పాత బకాయిలను చెల్లించాలని ఈ నెల 2వ తేదీ నుంచి ఆయా నివాస గృహాల వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో ఇందేమిటీ క్రమబద్ధీకరించిన నివాసితులు వాపోతున్నారు. బీ అండ్ ఆర్ లో కొత్తగా వచ్చిన ఏఈ కొందరు దిగువ స్థాయి సిబ్బంది ప్రోద్బలంతో నోటీసులు జారీ చేస్తున్నారని స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నందికొండ మునిసిపల్ అధికారులను ఫోన్ లైన్‌లో వివరాలు కోరగా ఈ నోటీసులకు తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు.



అధికారులు జారీ చేసిన నోటీసు

శిథిలావస్థలో పశు వైద్యశాల

● వర్షాకాలం వస్తే భయపడుతున్న సిబ్బంది



శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల — నిమ్ముపట్టిన స్లాబు గోడలు

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి) మండల కేంద్రంలో దేవరకొండ రోడ్డులో గల పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. వానాకాలంలో కురిసే వర్షాలకు భవనం స్లాబు కురవడంతో పాటు గోడలకు నిమ్ము రావడంతో షాక్ కొడుతోంది. ఆస్పతిలోని రికార్డులు తడుస్తున్నాయని వర్షాకాలంలో భవనం లోపల ఉండాలంటే భయమేస్తుందని, ఎక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది పేర్కొంటున్నారు. ఎప్పుడైనా భారీ వర్షం కురిస్తే స్లాబ్ కురవడం వల్ల గదుల్లో నీరు చేరుతుంది. దీంతో గదుల్లో చేరిన నీటిని బయటికు ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు రోడ్ల కూడలి కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ మూగజీవాలను చూయించుకోవడానికి మండల కేంద్రంలో గల పశువుల వైద్యశాలకు అధికంగా వస్తుంటారు. అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి

కొండమల్లేపల్లి పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుతుంది. వర్షం వచ్చినప్పుడు భవనం మొత్తం పూర్తిగా కురవడంతో రికార్డులు తడుస్తున్నాయి. ఒక్కోసారి గోడలకు ఇమ్ము రావడం వలన గోడలకు కరెంటు షాక్ వస్తుందని, ఇదే విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాను. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే కొత్త భవనం నిర్మాణం చేపట్టాలి

జి.నాగయ్య, పశువైద్యాధికారి,కొండమల్లేపల్లి

రాంచందర్‌రావును కలిసిన రతన్‌సింగ్



రామచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రతన్‌సింగ్

మిర్యాలగూడ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నారపరాజు రాంచందర్‌రావును ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బానావత్ రతన్‌సింగ్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో దినదినాభివృద్ధి చెందుతున్న కమలం పార్టీ రాంచందర్ నాయకత్వంలో అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన రాంచందర్‌రావు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులున్నారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం

మాడ్గులపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ పార్టీ సిద్ధంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలన్నారు.బూత్ స్థాయి నుంచి పనిచేసి మండలంలో ఎక్కువ మంది పార్టీ సర్పంచ్‌లను గెలిపించుకునేందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసింహ, శ్రీను, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దుటకు టీచర్లు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి తెలిపారు. మండలంలోని గొడకొండ్ల, వేంకటేశ్వరనగర్(మాల్) అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అక్షరభ్యాసం జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, గర్భిణి, బాలింతలకు బాలమృతం,పాలు, గుడ్లు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, సూపర్‌వైజర్లు సుగుణ, పార్వ తి, అంజమ్మ, యశోద, విజయలక్ష్మి, టీచర్లు ప్రభావతి, స్వప్న, లీలావతి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి విద్యార్థినికి ఐఐఐటీలో సీటు



స్పందన

కొండమల్లేపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డుపల్లి స్పందన తాజాగా ఐఐఐటీ బాసరలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు విద్యార్థిని ఐఐటి బాసరలో ఎంపిక కావడం పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులు స్పందనను అభినందించారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

మిర్యాలగూడ అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు లింగయ్యగౌడ్ తెలిపారు. అనంతరం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలో ఉండడంతో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవతీసుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మినా ఇంజనీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని

మిర్యాలగూడ అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్న మినా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కళాశాల విద్యార్థిని శనివారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా మునగాల మండలం నారాయణగూడకు చెందిన కొలుకులపల్లి అఖిల 2022 ఇంటర్ పూర్తిచేయగా ఇంజనీరింగ్ అడ్మిషన్ ఇస్తామంటూ ఎస్ఎస్సీ మెమో తీసుకున్నారు. ఇంటి వద్దకు వెళ్లి తీసుకున్న సర్టిఫికెట్‌ను తిరిగి ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని బతిమాలుకున్న పట్టించుకోవడం లేదన్నారు. అఖిల ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసి పై చదువుల కోసం వెళ్లేందుకు మెమో అవసరమై కొద్దినెలలుగా కళాశాల చుట్టూ తిరుగుతుంది. ఈ విషయం తెలుసుకొని కళాశాల ఛైర్మన్ మహిమూద్‌అలీ వేడుకున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. సబ్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యా దు చేసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, విద్యార్థినీ అఖిల, తల్లి రాణి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

హాలియా, జూలై 5(ఆంధ్రజ్యోతి):హాలియాలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్.పవన్‌కుమార్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ తెలిపారు. జూలై 5,6న హన్మకొండలో జరిగే 600 మీటర్ల పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. పవన్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రవు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ చంద్రశేఖర్, అభినందించారు.

చలో ఈదుముడిని జయప్రదం చేయాలి

పెద్దవూర, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఈనెల 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం చలో ఈదుముడి బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 21 మందితో ఈదుముడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమై అనేక ఉద్యమాలను చేపట్టడం జరిగిందన్నారు. జూలై 7 నాటికి బహిరంగ సభకు అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మండల సత్యనారాయణ, జానయ్య, ఏనుగుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

(5వ పేజీ తరువాయి)

, 36.3శాతం వర్షపాతం లోటు ఉంది. అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో 757.7మి.మీల వర్షపాతం నమోదైంది. ఈ డివిజన్‌లో 70.9మి.మీల అధిక వర్షపాతం నమోదైంది. గుడిపల్లి, గుర్రంపోడు మండలాలు మినహా అన్ని మండలాల్లో సాగుకు ఉపయోగపడేలా వర్షం కురిసింది. చండూరు డివిజన్‌లో 491.3మి.మీల వర్షపాతం నమోదు కాగా, ఇంకా 5.8 మి.మీల లోటు ఉంది. జిల్లా వ్యాప్తంగా సగటున ఇంకా 11.6మి.మీల వర్షపాతం లో టు ఉంది. ఈ వర్షాలు మెట్ట పంటలకు మేలు చేకూర్చినా,ఇంకా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో బోరు బావుల్లోకి నీరు రాలేదు.

పెరిగిన యూరియా వాడకం

జిల్లాలో యూరియా వాడకం పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు యూరియాను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 57,270మెట్రిక్ టన్నులకు పైగా ఎరువుల నిల్వలు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.యూరియా గోదాంలో 1,767 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా, 13,015మెట్రిక్ టన్నులు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఉంది. అదేవిధంగా రిటైల్ వ్యాపారుల వద్ద 9,155 మెట్రిక్ టన్నులు ఉంది. మొ త్తంగా ప్రస్తుతం 24,929మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉంది. జూలై నెలకు అవసరానికి అనుగుణంగా యూరియాను నిల్వచేశారు. డీఏపీ 2,926 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 2,269మెట్రిక్ ట న్నులు, ఎన్‌పీకేఎస్ 25,580మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఎస్ఎస్‌పీ 1,425మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌వోఎం 35మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ప్రధానంగా యూరియాను పత్తి పంటకు అధికంగా వినియోగిస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం ఎరువుల నిల్వలను పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం మెట్ట పంటలకు బోరు బావుల కింద వరి సేద్యానికి నాగార్జునసాగర్ ఆయకట్టు కింద నాట్లతో పాటు రానున్న రోజుల్లో నీటి విడుదల జరిగితే అందుకు అవసరమైన ఎరువుల ఇండెంట్‌ను వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

నిబంధనలు పాటించాలి : ఎస్ఐ



మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాంమూర్తి

చింతపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా పాల్పడితేవారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.రాంమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో హైవేపై వెళ్లే వాహనాలను క్షణ్ణంగా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం

తిరుమలగిరి(సాగర్), జూలై 5 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని గరకనెట్టతండాలో శనివారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. బాధిత రైతు సపావత్ సామా తెలిపిన వివరాల ప్రకారం.. మేత మేసేందుకు తండాలోని పొలానికి ఆవు వెళ్లగా అక్కడే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తగలడంతో షాక్‌కు గురై ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ఆవువిలువ రూ.60వేలు ఉంటుందని ప్రభుత్వం తనకు సాయం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజే స్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి

వేములపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన వరికుప్పల హేమలతకు రూ.18,500, జిన్నె జానకికి రూ.15 వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైంది. సంబంధిత చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి వారికి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోటిరెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రయ్య, సైదులు, శీలం జగన్, శ్రీను, సంజీవచారి పాల్గొన్నారు.